

# నచ్చిన భాగం

## పులికంటి కృష్ణారెడ్డి

'ఆశీర్వదించు మావయ్యా !' అని సతీసమే తుడై కొక్కెరకంకులా వంగి తన పాదాలమీద మోక రింపబోయిన మోహనరంగాన్ని చూచి మూడడుగులు వెనక్కు వేశాడు ముకుందయ్య !

దుమ్మెత్తైనా, తిమ్మెత్తైనా, నచ్చినా నచ్చ కున్నా, నమస్కారాన్ని స్వీకరించి, ఉలక్కుండా పలక్కుండా కూర్చోవడానికి ముకుందయ్య గుళ్లో దేవుడు కాదు — ఓ సామాన్య మానవుడు. అందులో స్వప్రయోజనం ఎంత స్వల్పమోతా దుతో కనుపించినా, పిలిచి నమస్కారంబెట్టే, కంటబడ్డ సొటాలుకు వెంటబెట్టుకపోయి చిరు దరహాసాన్ని పెదవులు చిందిస్తూంటే ఓ అర కప్పు కాఫీ ఎదుటవ్యక్తి పెదవులకు అందించే వ్యక్తిత్వం కోపకు క్రొనచూపే బుద్ధిశాలి ! పని లేకపోతే చూచీచూడనట్లు సందు క్రొవలు వెదికే ప్రజ్ఞాశాలి !!

"—అలాంటి ముకుందయ్యను అటూ, ఇటూ— అంటే అటు ఆహ్వానించడమో, ఇటు పలకరించ కుండా ప్రక్కకు తప్పుకోవడమో కాకుండా 'ఇరకా టం'లో పడవేసి నిలబెట్టింది అతనికీ మోహన రంగానికీ మధ్యగల బాంధవ్యం ! ....

పంటేపండని సోయగాల కమసోగలు వంపులు తిరిగాయి. చుట్టస్నేహంతో కాటుక దిద్దు కొన్న పెదవులు వణకుతూ మరీ వికృతంగా కనిపిస్తున్నాయి. హద్దుమీరిన ఉచ్ఛ్వాస నిశ్వాస లతో బొద్దుగా ఉన్న శరీరము పైకి లేస్తూ పడుతూ ఉంది ! ....

మూడడుగులు వెనక్కువేసి నిలబడిన ముకుం దయ్య ఆకృతిని ఆవరించుకొన్న వికృతరూపం అత నిని ఇరకాటంలో పడవేసినదనడానికి నిదర్శనం !

"ఇదేమి విడ్డూరమే ! అయినవాడు కదవ తొక్కుకొనివస్తే ! .... " చూడడానికి వచ్చి చుట్టూ గుమిగూడిన అమ్మలక్కలలో గుస గుసలు !

సాధారణంగా పల్లెటూళ్లల్లో ఓ క్రొత్త మొగం కంటబడిందంటే, వెంటబడి ప్రశ్న పరంపరలతో ముంచెత్తి ఆ వచ్చినవారి పుట్టుపూ ర్వోత్తరాలు పరీక్షించేవరకు వదలిపెట్టరు. భార్య అనుసరిస్తూంటే ఊళ్లో అడుగుపెట్టిన మోహనరంగాన్ని చూచి పంజవేళ ఇంటిముందర చెత్త ఊడుస్తూ ఉండిన అమ్మలక్కలు చేతిలో చీపుర్లు ఎక్కడివక్కడ పారవేసి, దుమ్ము నిండిన మొగాలపై దోసెడు నీళ్లు ప్రోక్షించి, పైట కొంగుతో తడి ఒత్తుకుంటూ ఏదో మునిగిపోయి నట్లు వెంబడించారు. ఆ ఇంటి వరండా నిండుగ గుమిగూడారు.

వంకాయకు క్రింది భాగాన రెండు, పై భాగాన రెండు వ్రేలెడంతంత పారకపుల్లలు గుచ్చి 'మనిషి బొమ్మ' అని ఆడుకొంటూంటారు పిల్ల కాండ్లు. అచ్చం ఆ రూపానికి ప్రతిస్వరూపా



ఉన్నట్లుగ ఉంటూ, పదేండ్లక్రిందట పశువుల వెంబడి తిరుగుతూండిన మోహనరంగం నేడు ఎర్రనేలలో గనుముగడ్డ ఆయకట్టు ఊరి, తన పేరు సార్థకపరచుకొనేసరికి అందరూ ఆశ్చర్యములో మునిగితేలుతూ, పరామర్శమాట అటుంచి కేవలం ఊపిరి సలుపుకోలేక ఒకరి మొగం ఒకరు చూసుకొంటూ నిలబడ్డారు. పెరట్లో పొయ్యి రాజేసి, ఇంట్లో సంజదీపం వెలిగించడానికి పోతూఉండిన ఇంటి యజమానురాలు రామలక్ష్మమ్మ మాత్రం 'ఏమిటీ గుంపు !' అని రెప్పపాటు నిలిచి, మోహనరంగాన్ని చూచి నివ్వెరపడి, అంతలోనే తేరుకొని 'ఓ మోహనరంగమా ! ... రా నాయనా ! రా !! ....ఎప్పుడు రావడం ? అయ్యో రాతా ! అలా వాకిట్లో నిలబడ్డావేం ? నువ్వేం కొత్తవాడివా ఈ ఇంటికి ?' అని ఆ నిశ్శబ్దతకు నీరాజనమెత్తింది. ఆ ఆహ్వానములో ఆప్యాయత లేదు. ఆదరణ లేదు. లేదంటే ఇంట్లో అడుగుబెట్టిన బంధువును పలుకరించకపోతే బాగుండదన్న సంస్కారం మాత్రం లీలగా గోచరిస్తూంది. ఇంటి యజమానురాలు ఆ సత్కారబాధ్యతను వహించేసరికి ఇంటి యజమాని బాధ్యతా 'ప్రోనోటు' లో చెల్లు వ్రాశాడు. సగం కాలీ కాలని చుట్టను విసరి నేలకుకొట్టి విసవిస వెళ్లిపోయాడు !

మామగారి ఈ ప్రవర్తన నైతే తాను ఇంతకు ముందే ఊహించుకొన్నాడు కాబట్టి మోహనరంగం ఆశ్చర్యపడలేదు. కానీ ఊళ్లో అమ్మలక్కలు తన్ను, తన భార్యను ఇలా, వెర్రి చూపులతో చూస్తూ నిలబడేసరికి, తనకే ఎబ్బెట్టనిపించి, ఆ వాతావరణంనుండి తొందరగ విముక్తుడై పోవా లనుకున్నాడు.

"ఇప్పుడే బస్సు దిగి వస్తున్నా నత్తయ్యా ! మామగారు కనుపించితే ఆశీర్వాదం పొందాను. ఇంతలో మీరు కనుపించారు !" అంటూ లేని నవ్వుతో లోని కేగాడు. అర్థాంగి అతని అడుగుజాడల్లో నడిచింది. రామలక్ష్మమ్మ వారి ననుసరించింది.

వరండాలో గుమిగూడిన అమ్మలక్కలకు కొండంత నిరాశ మొగాన మొత్తినట్లయింది. వాళ్ల హృదయాల్లో పుట్టిన కోరికలు నాలుక కొనవరకు వచ్చి కొనలోనే పూసిపోయాయి. దాంతో వాళ్లు రెచ్చిపోయారు. 'ఓ యబ్బ ! నిన్న మొన్నటిదాక ఎద్దుగొడ్లు, ఆవుగొడ్లు మేపుతూ న్నోంది మరచిపొయ్యినట్లుందిలే !' అని తల కొక్క తీరుగా దెప్పిపొడుస్తూ ఆ సభారంగం నుండి ఒక్కరొక్కరుగ జారుకొన్నారు. అంతకు ముందు వారం పదిహేను రోజులుగ జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడి, సభాస్థలిమీద నిలబడి అప్పుడే కృతజ్ఞత తెలుపుకొంటూ ఉండిన 'అష్టగ్రహకూటమి సమస్య' ఆగ్రాతి తన పీటమిని అంగీకరించి తనస్థానంలో మోహనరంగాన్ని నిలబెట్టిందంటే అది సత్యదూరం కాదు !

సంజవేళ ! ఆ పల్లెవనాంతరసీమలో ఓ ఘూరుహములా తయారయింది. ఒకప్రక్క అడవికి మేతకేగిన ఆలమందల్ను, కొక్రెలగుంపులు,

# నచ్చిన భాగం

మరోప్రక్క పొలాలలో పని ముగించిన రైతుబిడ్డలు, నెత్తిమీద వచ్చగడ్డిమోపులతో పడుచుపిల్లలూ, అందరూ ఇంటిముఖం పట్టారు. "ప్రొద్దు పోతుందేమో !" అన్న ఆతురత వాళ్ల మొగాలలో బాగా ద్యోతకమవుతూంది. ప్రకృతి పిల్లవాడు విసరివేసిన బంతిలా సూర్యుడు కొండల కావల పడబోతున్నాడు. నట్టింట ముట్టించిన సంధ్యదీపం నిశ్చలంగా వెలుగుతూంటే ఆ నిశ్చలతకు నాలుగు కాలాలపాటు భంగం వాటిల్లనీయవద్దని సంధ్యలక్ష్మి మ్రోల మోకరిల్లింది రామలక్ష్మమ్మ మోహనరంగం భార్య—రేఖను ఇంటిలో వదలి తానలా పొలాల వైపు బయలుదేరాడు. ఆమెకు ఆ ఊరు, ఆ ఇల్లేగాదు, ఆ యింటి ప్రతివ్యక్తీ క్రొత్త ! అప్పుడే ఇంటిలో

"నన్ను మీరు నిజంగా ప్రేమిస్తున్నారా?"

"ఇంకా అనుమానమే!"

"మరి నా కోసం మీరు చావడానికి కూడా సిద్ధమేగా"

"క్షమించు ప్రేయసీ! నాది అమరప్రేమ."

జి. ఆర్. రావు (మద్రాసు)

అడుగుబెట్టిన 'కొత్తకోడలు' తీరుగా ఉంది ఆమె పరిస్థితి. ఆ పరిస్థితిని జీర్ణించుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంది ఆమె ! ....

*　　*　　*

మోహనరంగం ముకుందయ్యకు వేలువిడిచిన అప్పచెల్లె కొడుకు. అంటే ఆ యింటికి అల్లుడు కాదగ్గ మేనరికం పట్టభద్రుడన్నమాట ! మోహనరంగం తండ్రి నరసయ్య. తల్లి నాగరత్నమ్మ. నరసయ్య ఆ చుట్టు ప్రక్కల పది పదిహేను పల్లెలకు మకుటంలేని మహరాజు. నంజ పుంజ గలిసి ఓ ఇరవై ఎకరాల పొలం సేద్యగాళ్ల చేతుల్లో అవకతవకలుగ సాగవుతూంటే, పది వేల రూపాయల రొఖ్ఖం నరసయ్య చేతుల్లో దివ్యంగా సాగుబడి అయ్యేది. నరసయ్య చేస్తున్న ఈ సాగుబడికి అర్రులు చాచి ఆకాశంవైపు చూడవలసిన అవసరం కానీ, స్వేదజలంతో భూమాతను అభిషేకం చేయవలసిన ఆవశ్యకతగానీ ఉండేదిగాదు. కాగా సేద్యగాళ్ల వ్యవసాయం ఆరు నెలల కొకసారి, లేదు ఏడాది కొకసారి ఫలితాన్ని అందచేస్తూంటే, నరసయ్య వ్యవసాయం ప్రతి నెలా 'మణియార్డరు'లాగ ఓ వంద రూపాయల ఫలితాన్ని అందజేసేది. అంటే — ఆయన చేస్తున్నది వడ్డీవ్యాపారం ! ఆ వ్యాపారంలో ఆయనకు ఊపిరి సలుపుకొనే అవకాశం గూడ దొరికేది గాదు. ఇచ్చిపుచ్చుకోవండ్ల ప్రాతకోతలు వ్రాసుకోవడం, రాని డబ్బుకు కోర్టులచుట్టూ తిరగడం .... క్షణం తీరిక ఉండేది కాదు. పైగా కోర్టులచుట్టూ తిరిగిన అనుభవంతో ఆ ప్రాంతంలో ఆయన బోర్డు తగిలించుకోని నాటు వకీలు ! గ్రామాల్లో చిల్లర జగడాలు మొదలు ఆస్తి పంపకాల వరకు నరసయ్య ఆవశ్యకత ఎంతయినా ఉండేది. అలాంటి సదవకాశాలను సద్వినియోగం చేసుకోవడములో నరసయ్య బహుముఖ ప్రజ్ఞాశాలియై ప్రవర్తిస్తూంటాడు. 'నాయనా ! మీకు నామీద ఉన్న గౌరవం కొద్దీ నన్ను పిలిపించారు. మీమాట కాదనలేక నేనూ వచ్చాను. సంతోషం ! కానీ ఒక తల్లిగర్భంలో జన్మించిన మీకు మీకే పడకపోతే నామాట వింటారని నమ్మక మేముంది ?' అని అన్నదమ్ముల ఆస్తిపంపకాన్ని ఆరంభించి, తన మాటప్రకారం నడచుకోవడానికి షరత్తులుగ ఇరుపక్షాలనుండి ఓ వెయ్యిరూపాయలకు బాండ్లు పుట్టించి దేవునిమీద భారం మోపి భాగవిమర్శ అయిందనిపిస్తాడు. తరువాత ఆ రెండు 'ప్రోనోటు' లను జేబులో పెట్టుకొని ఇల్లు చేరుతాడు. తీరా, ఆ ప్రోనోట్లను వాపసు ఇమ్మని అడిగినప్పుడు, వెయ్యి రూపాయల బాండును ఊరకే ఇమ్మనడం భావ్యం కాదనీ, ఇంకనూ కాస్త మొండిఘటాలుగ ఉంటే కోర్టు కెక్కుతానని బెదరించి చాకచక్యంగా నరసయ్య తన ఫీజు గుంజుకుంటాడు—

అయితే నమ్మకం పెట్టుబడిగా యిలాంటి వ్యాపారం ఎన్నాళ్లు సాగుతుందన్న సందేహం కలగడం అసమంజసము గాదు. అనవసరము గాదు—ఆ గ్రామాల్లో సాధారణంగా జరుగుతూండే కీచులాటల తీర్పులో 'తప్పు' అని నిర్ణయించబడ్డ పక్షంనుండి తప్పురూపంతో వసూలుచేయబడ్డ 'పైకంతో నరసయ్య 'కోటకోటమ్మ' తిరుణాలు వైభవోపేతంగా జరిపి తనకు మించిన దైవభక్తిపరుడుగాని, దానకర్ణుడుగానీ లేడనిపించుకుంటాడు. అంతకూ ఎవరైనా ఎదురుతిరిగితే ఆ మరుసటిరోజు నుండి నరసయ్య ఇంటిలో ఇనప్పెట్టె తలుపు వేసింది వేసినట్లుగానే ఉంటుంది ! ఏదో 'నోటికి చేతికి' గా బ్రతుకుతున్న ఆ పల్లెల్లో ప్రజలు తమ అవసరాల పోరు పడలేక కిక్కురుమనకుండా అన్నీ భరిస్తూంటారు. ఇలా 'సాంఘిక సేవ'లో మునిగి తేలుతున్న నరసయ్యను పొలం పనుల్లో ఆదుకోవడానికిగాను, నాగరత్నమ్మ ముకుందయ్యకు తన యింటిలో ఆశ్రయమిచ్చింది.

ముకుందయ్యకు కండబలం, తండ్రి సజీవుడై ఉన్నప్పుడు చదివించిన 'అరా కొరా' చదువు మినహా ఎలాంటి బలమూ, బంధమూ లేదు. అందువల్ల ఆ అసహాయుణ్ణి ఆదరించి అతని కండబలాన్ని సద్వినియోగపరచుకొందామన్న సదుద్దేశముతోనే నాగరత్నమ్మ తమ్ముణ్ణి ఆహ్వానించింది. ముకుందయ్యకూడ దారీ తెన్నూ లేని తన ఓటి జీవితానికి దారి చూపిస్తున్న అప్పచెల్లెమాట కాదనలేకుండా ఆమెయిల్లు చేరాడు. 'బావమరిది బ్రతుకగోరుతాడు' అన్న నానుడి అడుగుజాడల్లో నడుస్తూ తనుని

తాను చేసుకపోతున్నాడు. ఇప్పుడు పొలం పనులు కాస్త చురుగ్గా సాగుతున్నాయి. ఆదాయం కూడ అంతకంత వృద్ధి అవుతూంది. ఈ పరిణామంతో నరసయ్యకు పనుల ఒత్తిడి పరిమాణం కాస్త తగ్గినట్లనిపించి, కాసేపు నిలబడి కారణాన్ని ఆలోచించవలసి వచ్చింది. ఎప్పుడు తింటాడో ఎప్పుడు నిద్రపోతాడో తెలియకుండా తన పని తాను చేసుకపోయే ముకుందయ్య కనులముందు మెదిలాడు. ఆతన్ని చూస్తూనే నరసయ్య మన స్సులో ఒక ఆలోచన పుట్టింది. వెంటనే 'ఒసేవ్ నాగులూ !'' అంటూ ఒక గావుకేక పెట్టాడు

చెమట తుడుచుకోబోతే అంటుకున్న మసి, చెమటతో కలిసిన నుదుటి కుంకుమ మొగాని కొక వికృతాకృతి నిస్తే, తలమీద నిండిన రాగి పిండితో వెంట్రుకలు నెరసినట్లనిపించి మునలి తనాన్ని ముందుబెట్టుతూంటే, పైట చెరగు తీసి నడుముకు చెక్కి, సంకటి ముద్దలు చేస్తూం డిన నాగరత్నమ్మ 'ఎందుకండి ? అలా అరు స్తున్నారు !' అంటూ ఉన్న పళంగా వచ్చి ఎదుట నిలబడింది.

"నాగరత్నం యిలా మసిమసిలో పొర్లాడడం నాకేమీ ఇష్టంలేదే ? .... అందుకే ఒక చక్కటి ఆలోచన ...... "

"ఓయబ్బ ! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు ? .... ఇంతకూ ఏమిటో ఆ ఆలోచన !''

నరసయ్య నోటమాట నోట్లో ఉండగానే ఎదురు ప్రశ్నను సరసంగా సాగదీసింది నాగ రత్నమ్మ.

"చూడు నాగులూ ! ముకుందయ్య రావ డంతో నాకేదో కాస్త తెరిపి చిక్కినట్లని పిస్తూంది. వాడికిగూడ ముప్పైఏండ్లు నెత్తి కెక్కాయి. వాణ్ణి ఒక యింటివాణ్ణి చేస్తే ...."

"సవతిపోరులాంటిది ఒకటి నా కుంటుం దంటారు !''

"ఛ ! ఏమిటే ! నువ్వా నీ మాటలూ ! .... నీ అడుగులకు మడుగులొత్తే అమ్మాయిని చూసే ఉంచాను. నువ్వు ఊఁ ! అంటే చాలు ! ఆమీదట నీకు 'సూపర్వైజరు' ప్రమోషను ఖాయం !''

ఓ చిరునవ్వుతో కనుబొమ ఎగురవేశాడు నరసయ్య !


"అదేదో మీ యిష్టప్రకారం కానీయండి. పలక మీద సంకటి ఆరిపోయిందంటే కూలీలు మొత్తు కుంటారు.'' అంటూ నాగరత్నమ్మ వెళ్లిపోయింది. ఆమీదట ఒక శుభముహూర్తాన నరసయ్య ఇంటి కూటమి వివాహవేదికగా అలంకరింపబడితే ముకుం దయ్య రామలక్ష్మమ్మ ఆలూ మగలుగా_అమరి పోయారు.

కాలప్రవాహం సాఫీగా సాగిపోతే వక్రగతుల ఆరోపణకు భగవత్స్వరూపాన్ని గురించి ఆలో చించే అవసరము ఉండేదే గాదేమో ! ఒకనాడు మిట్టమధ్యాహ్నం. నిప్పులు చెరిగినట్లుంది ఎండ ధాటి. మధ్యవర్తిత్వం నిర్వహించిన ప్రక్కన పల్లె నుండి ఒంటరిగా వస్తున్నాడు నరసయ్య. ఉన్న గట్టుక వచ్చినట్లు ఎక్కడనుండి వచ్చిందో 'సుడిగాలి' 'రివ్వు' మని వచ్చి అతనిని చుట్టి వేసింది. ఊపిరి సలుపుకోలేక, ఆ సుడిగాలి దెబ్బకు హడలి తలతిరిగి పడిపోయాడు.

స్పృహవచ్చి చూసేసరికి నరసయ్య తన ఇంటిలో మంచంమీద పడుకొని ఉన్నాడు. పెల్లు బికివస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుకొంటూ నాగ రత్నమ్మ విసనకర్రతో మెల్లగా విసరుతూంది. అయిదేండ్ల పసివాడు మోహనరంగం తల్లి ప్రక్కన నిలబడి వెర్రిచూపులు చూస్తున్నాడు. భూతవైద్యుడు 'శీపాటి వెంకటరెడ్డి' చేతిలో వేప మండ గాలిలో ఎడతెరపిలేకుండా గిరికీలు కొట్టు తూంది. ముకుందయ్య కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ గ్రామాంతరం వెళ్లిన నాటువైద్యుని కోసం తపన పడుతున్నాడు. తలుపు చాటుగా నిల బడిన రామలక్ష్మమ్మ పైటచెరగులో కంటి తడి ఒత్తుకొంటూ వచ్చి 'ఎర్రనీళ్ళ' తీసి మూడు త్రోవలు కలిసేచోట పార జల్లడానికిగాను వెళ్లి పోయింది ఏదో 'గాలి'సోకిందిలే అని కొంద రంటే 'పాపం పండిందని' గుండెధైర్యంలేని కొందరు గోడచాటుగా గుసగుసలాడారు. ఎలా గయితే నేం , నరసయ్య మామూలుమనిషి కావడానికి పది రోజులు పట్టింది. మామూలు మనిషి అయితే అయ్యాడు కానీ, అతనిలో ఈ 'చిన్నె'మాత్రం మా మూ లు అయిపోయింది. ఉన్నట్లుండి, పడిపోవడం, నోరు బిగుసుకుపోయి నురుగులు గ్రక్కడం, కాళ్ళు చేతులు విలవిలా కొట్టుకోవడం, ఓ అరగంటకాలం ఇలా గుంజా కొని తన్నుకొని మరలా మామూలు స్థితికి రావడం తరచు జరుగుతూండేది. రకరకాల నాటు మందులు, ఇంగ్లీషుమందులు అపజయాన్ని అంగీకరించేసరికి కారణాన్ని కర్మమీదికి త్రోసి 'మూర్ఛ' అని నామకరణం చేశారు వైద్యులు !

ఈ దెబ్బతో నరసయ్య బాగా దిగులుపడి పోయాడు. తనజీవితాని కిక విష్కృతి లేదని బాధపడ్డాడు. తెలివితేటలన్నీ ఖర్చయిపోయినట్లు తలంచి మానసికంగా ముసలివాడై పోయాడు. అందువల్ల అతని జీవితవిధానమే మారిపోయింది. ఇంటిలో ఒక మూల కూర్చుని ''ఆధ్యాత్మిక' చింత లోనే అలసిపోతాడు. కాలు కదిపి బయటరాడు. ఆశావాదం నశించి, నిరాశావాదం తలకెక్కి, ఏక్షణం ఎటుంటుందో అన్నభ్రాంతిలో పడి పోయాడు. అందుకే బాగా ఆలోచించి గ్రామ కరణాన్ని పిలిపించి తన ఆస్తిపాస్తుల విషయం తగిన కట్టుదిట్టంచేసి ఉంచాడు. ఈ విషయం తనకూ కరణానికి మినహా ఎవ్వరికీ తెలియనీయ లేదు.

తరువాత దొర్లిపోయిన ఆరుసంవత్సరాలలో చెప్పుకోదగ్గ విశేషాలకు చోటులేదు. అది వైశాఖమాసం. రైతులు పనులు ఒడిపి వసంత లక్ష్మి శీతలచ్ఛాయల్లో కథాశ్రవణం చేసుకొనే కాలం. ఆఏడు కూడ 'నల్ల వెంగనపల్లె'లో మహా భారత ఉత్సవం జరుగుతూంది. మిట్టమధ్యాహ్నం చల్లని పందిరిక్రింద 'పగటి కథ' వింటూ రాత్రి 'వీథి భాగవతంతో' ఆ చుట్టుప్రక్కల పల్లెల్లో ప్రజలు ఓ పదిహేను రోజులు పండుగలా గడుపుకొంటారు. ఆనాటి రాత్రి బకా సురవధ ! బకాసురుడివేషం కట్టే పటుదు






ఐ టెక్స్

కాటుక

(ఆయుర్వేద శాస్త్ర పద్ధతిన తయారైనది)

చంటిపిల్లలకుకూడా వాడవచ్చును.



అరవింద్ లేబరేటరీస్,

పి.బి. 1415, మద్రాసు-17.

హైదరాబాద్ మినహా ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు : ప్రగతి ఏజెన్సీస్, విజయవాడ-1.

కుష్టు సమస్త మేహ వ్యాధులకు

బొల్లి

మొదటి నెలలో 40% నివారణ!!!

10% నివారణ!!

మా లెప్రసీన్ అమోఘ ఔషధము!!!

వివరములకు గ్రంధే రఘురామ గుప్త


అమర జ్యోతి ప్రొడక్ట్స్ మార్కాపురం కర్నూలు జిల్లా.

ఆంధ్రా కాఫీ రకములు

గోల్డెన్ బ్లెండు — హోటల్సు బ్లెండు

పాప్యులర్ బ్లెండు — రెడ్ లేబుల్ కాఫీ

ప్రశస్తమైన కాఫీ పొడరు.




ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ.

హెడ్డాఫీసు:- గుంటూరు-2.

బ్రాంచీలు:- పట్నంబజారు, బ్రాడీపేట (గుంటూరు)

బాపట్ల, సత్తెనపల్లి, నర్సరావుపేట & హైదరాబాద్-20.


# నచ్చిన భాగం

కాలికి గజ్జె కడితే దుమ్ము జానెడెత్తు లేస్తుందని విని ముకుందయ్య రాగిపైరుకు, మిరప తోటకు పెందలాడే నీళ్లు తోడి సేద్యగాళ్లతో కలిసి నాటకాని కెళ్లాడు. ఆట ముగిసేసరికి చుక్క నడిమిట్ట కెక్కింది. తిరిగి ఇల్లు చేరేసరికి తొలి కోడి కూసింది. ఒక్క నిద్ర తీసి ఆపైన కపిల కట్టదా మనుకొన్నాడు. పగలంతా కష్టపడటం, రాత్రి నిద్రగాయడం, అలా పడుకొన్నాడో లేదో నిద్ర ముంచుకొచ్చింది.

"అయ్యో ! ఇక నా గతేమి కానురా ! తండ్రీ !' అన్న పిడుగులాంటి ఆర్తనాదం తట్టి లేపినట్లని పించి ఎగిరిపడి లేచాడు ముకుందయ్య. నాగరత్నమ్మ 'లబోదిబో' అని మొత్తుకొంటూ పరుగెత్తుతూంది. తూరుపున పటమొగిరింది. అప్పుడప్పుడే నిద్రలేచి కన్నులు నలుపుకొంటున్న కొంతమంది 'ఏమి జరిగిందంటే ? .... ఏమి జరిగిం దంటూ' నాగరత్నమ్మ వెంటబడ్డారు. ముకుందయ్యకూడా పిచ్చివాడిలా వారి ననుసరించాడు. ఊరి గెవిన్లో ఎదురుపడ్డ దృశ్యాన్ని చూచి నిర్ఘాంతపోవడమేమిటి ? .... నిలువునా కూలిపోయాడు !

నీళ్లోడుతున్న నరసయ్య శవాన్ని మోసుకొస్తున్నారు కొంతమంది !

ఆవేళ మలికోడి కూయడంతో భగవద్గీతా పారాయణార్థం నరసయ్య నిద్ర లేచేసరికి మొట్టమొదట ఆహ్వానం పలికింది ముకుందయ్య, సేద్ర గాళ్ల ఒళ్లుతెలియకుండా నిద్రపోతూ పెడుతున్న గురక. అది వినేసరికి అతనికి చిర్రెత్తుకొచ్చింది. కాలికొద్దీ తిరుగుతున్న మనిషి ఈమధ్య కదలకుండా కూర్చునేసరికి ఈ గుణం కూడ కాస్త బయటపడింది.

"కూలిసేద్యపు ఎదవలు .... లేకుంటే తెల్లారిపొయ్యేదాకా ఒళ్లు తెలియకుండా ఇలా నిద్రపోతారా ?' అని నసుక్కుంటూ ఎద్దుల విప్పాడు. వాళ్ల కొక గుణపాఠం నేర్పుదామని పోయి 'కపిల' కట్టాడు. కానీ పరిస్థితులు అతనికే "వల్లమాలిన పని చేయవద్దు !" అన్న గుణపాఠాన్ని నేర్పాయి. వాడుకలేని పని ! తప్పుమోకు పడడం, ఎద్దులు వెనక్కు రావడం, మోట విరిగి కుప్పగ బావిలో కూలిపోవడం క్షణాల్లో జరిగిపోయింది. చుట్టుప్రక్కల కపిలతోలుకుంటూండినవాళ్లు వచ్చేసరికి నరసయ్య ప్రాణాలు గంగలో కలిసిపొయ్యాయి !

ఆ తరువాత నరసయ్య కుటుంబ పరిస్థితులు వసంతఋతువునుంచి ఒక్కసారిగా గ్రీష్మంతో అడుగు బెట్టాయి. నాగరత్నమ్మ ఏమీ పట్టించుకొనేది గాదు. ఆ యింటిలో ఓ మూల కూర్చుని 'కుమిలి కుమిలి' ఏడుస్తూండేది. ఆ సంవత్సరమే మోహనరంగం ఆ ఊళ్లోని హయ్యరు ఎలిమెంటరీ స్కూల్లో ఎనిమిదవతరగతి పాసయ్యాడు. బాకీలవసూళ్లు కూడ ఎక్కడివక్కడ నిలిచిపొయ్యాయి.

"చూడు చెల్లెమ్మా ! బావ మనలని నడిసముద్రములో విడిచిపోయాడు. నన్నొక మనిషిగా నిలబెట్టిన ఆయనకోసం నేనెంత పరితపిస్తున్నానో ...."



# నచ్చినభాగం

## పులికంటికృష్ణారెడ్డి

గతసంచిక తరువాత

ఆ రాత్రి ముకుందయ్య జీవితరంగంలో ఓ ముఖ్యమైన ఘట్టం. 'ఒక అవతార సమాప్తితో మరో అవతారం రూపురేఖలు దిద్దుకొనే వేళా విశేషం.' ఆవేళ సూర్యోదయంతోపాటు ఆరంభ మయిన వేషమహిమ కాలక్రమేణ సాధనలో పరిణతిచెందిన రాగంలా రక్తిగట్టింది. అతని వ్యవహారదక్షత బాగా పెరిగిపోయింది. ఆస్తి పెంపకంపట్ల ఆసక్తి, ఖర్చుపట్ల ముభావం ముదిరిపోతున్నాయి. దినాలు గడిచిపోతున్నా పిల్లవాడి చదువుప్రసక్తి ఆమీదట రానేలేదు. ఒకరోజు నాగరత్నమ్మ ముకుందయ్యను పిలిపించి అడిగింది.

'ఏమన్నయ్యా? మోహనుడి చదువుసంగతి ఏం చేశావు? .... బడులన్నీకూడ తీస్తున్నట్లుంది!''

''అదే చెల్లెమ్మా! నేనూ ఆలోచిస్తున్నాను. ఏంచేద్దామన్నా మనస్కరించలేదు.''

''దీని కింతగా ఆలోచించే పనేముందన్నయ్యా? తిరుపతిలో చేరుద్దా మనుకున్నదేగా! అలా చేస్తే సరిపోదూ!''

''అక్కడేనమ్మా నేను సందేహిస్తూండేది. తూరుపు పడమట తెలియని పిల్లోడు. పట్నంలో గాలికి వదిలేస్తే ఏమైపోతాడో! .... అదుపు ఆజ్ఞలు లేకుండా పట్నాల్లో కుర్రాళ్ళ చెడిపోవడం మనం చూస్తూనే ఉన్నాం!''

''అయితే చదువు మాన్పించేద్దా మంటావా?

''రామ! రామ!! ఎంతమా టన్నావమ్మా! .... అలా చేస్తే ....''

ఆకాశంవైపు దృష్టిపెట్టి చేతులు జోడించాడు ముకుందయ్య. నాగరత్నమ్మ కేమీ అర్థంకాలేదు. ఒక్క లిప్తకాలం నిశ్శబ్దం!

''చూడు చెల్లెమ్మా! నాలుగు బారల్లో మన కేటూ ఒక హైస్కూలు ఉండనే ఉంది. ఉదయం వెళ్ళి సాయంత్రానికి వచ్చేయచ్చు కూడ!''

''ఏవిటేవిటి? నాబిడ్డ దినమూ నాలుగు నాలుగు ఎనిమిది మైళ్ళ నడవాలీ! అలాంటి కర్మ నాబిడ్డకేం పట్టిందయ్యా! .... నువ్వు ముందు వాణ్ణి తిరపతికి పంపే ఏర్పాట్లు చూడు!''

కాస్త కటువుగానే మందలించింది నాగరత్నమ్మ.

''సరేనమ్మా! మీ సొత్తు తింటూ మీ పంచన పడి ఉన్నవాణ్ణి. మీరు చెప్పినట్లు చేయడం నా ధర్మం. ఏదో ఉండబట్టలేక చెప్పవలసి వచ్చింది. వంశానికి ఒక్కగా నొక్కడు. కనుముం దుంటాడని....''

ఎడమచేతి మునివ్రేళ్ళు తల పుణ్తెను. తడిమి చూస్తూంటే సానుభూతిని వ్యంగ్యంతో రంగరించి ఒలకబోశాడు ముకుందయ్య. నాగరత్నమ్మ మెత్తబడిపోయింది. దాంతో మోహనరంగం మురిపాలమూట మూలబడింది. చదువుకోసం దినమూ ఎనిమిది మైళ్ళు నడుస్తున్నాడు. ఎప్పుడైనా ఆదివారంపూట కాస్త తీరుబడిగా కూర్చుని ఉంటే, 'ఏం నాయనా? అలా పొలం వైపు వెళ్ళి రారాదూ!'' అయ్యయ్యో! ఆ గొడ్లు చూడు! ఎలా నిలువుగూటాన పడి వగరిస్తున్నాయో!' అని ముకుందయ్య మెత్తగా మందలిస్తూంటే, మోహనరంగం పొలంపనులు చూస్తున్నాడు. పశువుల మేపుతున్నాడు. అసలే అంత ధృడకాయుడు గాడు. ఎడతెఱిపిలేని శ్రమతో బాగా శుష్కించిపోయాడు. 'పూసురో' మని తిరుగుతూన్న బిడ్డను చూచి నాగరత్నమ్మ కడుపు తరుక్కుపోయేది. ఎప్పుడైనా అధవా ముకుందయ్యను అడిగితే 'చూడు చెల్లెమ్మా! ఆ కసుగందును కష్టపెట్టాలని నాకు మాత్రం సంతోషమా! పోనీ, ఆ తీరుగా నీ బిడ్డ చేస్తున్న పనులన్నా చెప్పమ్మా వింటాను. ఇంతకూ మంచికి రోజులు గావమ్మా ఇవి. నేనేదృష్టితో వాణ్ణి మందలిస్తున్నానో తెలుసుకోకుండా ఇలా మాట్లాడితే నేనేం చెప్పను! .... రేపు ఈ ఇంటికి వాడే పెత్తందారు' అన్న సంగతి మరచిపోతున్నావు. కాలు కదపకుండా, కష్టం తెలియకుండా వాణ్ణి ఒక అసమర్థుణ్ణి చేయమంటే .... సరే! నీ ఇష్టమమ్మా!!' అంటూ వెళ్ళిపోతే నాగరత్నమ్మ మనస్సు 'చివుక్కు' మనేది. తనకుటుంబ శ్రేయస్సుకై, బిడ్డ ఉజ్జ్వలభవిష్యత్తుకై అన్నయ్య చూపుతున్న వ్యవహారదక్షత చూచి నాగరత్నమ్మ హృదయం కృతజ్ఞతతో తొణికిసలాడేది.

నాగరత్నమ్మ పరలోకచింతలతో, ముకుందయ్య ఇహలోక వాంఛలతో మోహనరంగం హైస్కూలుచదువులో మరో మూడు సంవత్సరాలు దొర్లిపోయాయి. ఈలోపుగ నాగరత్నమ్మ పరలోకాన్నిగురించి ఏమీ తెలుసుకోలేకపోయింది.

ముకుందయ్య ఆస్తిని కాస్త పెంచాడు. మోహనరంగం మంచి మార్కులతో స్కూలుఫైనల్ పాసయ్యాడు. మరలా పై చదువుల ప్రసక్తి వచ్చింది.

ముకుందయ్య ఇక్కడ ఒక్క క్షణం నిలబడి ఆలోచించవలసి వచ్చింది. అతనికి ఈ కాలం కుర్రాళ్ళమీద అట్టే నమ్మకం లేదు. మోహనరంగాన్ని కాలేజి చదువులకు పంపితే, కాలేజిలో అతగా డక్కడ ఏదైనా ప్రేమ పెళ్ళికి తల పడితే తాను అదే పనిగ కని సాకుతున్న తన కూతురు గతేం కావాలి?— అన్నది అతని సందేహం! పిట్ట బయటపడకుండా చూసుకుంటే సొత్తులో సొత్తు చేరిపోవడమే కాకుండా, కూతురి జీవితం పూలపాన్పుపై దొర్లిపోతుందన్నది— అతని ఆశ! అందుకని ముకుందయ్య ఒకరోజు చెల్లెమ్మతో ప్రస్తావించాడు.

''చెల్లెమ్మా! మోహనుడు ఒక్కగా నొక్క బిడ్డ నీకు! కడుపు తీపి తెలియనివాణ్ణి కాను. వాణ్ణి పరాయి ఊళ్ళకంపడం .... నా కంతగా నచ్చలేదమ్మా! అందులో వాడు చదివి ఉద్యోగాలు చేసి ఊళ్ళేలబోయేది మాత్ర మేముంది? దేవుడిచ్చిన కాస్తో కూస్తో ఆస్తిని అనుభవిస్తూ కుటుంబ వ్యవహారాలు చూసుకోవడానికి అంతో యింతో చదువుకొన్నాడు. ఇంటిపట్టున ఉండి ...''

'నమస్కారమండీ! ముకుందయ్యగారూ!' అన్న పిలుపుతో అతని వాగ్ధోరణి ఆగిపోయింది. ఇద్దరూ గుమ్మంవైపు చూసేసరికి ఆ ఊళ్లో హైయరు ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరు 'అప్పావుపిళ్ల' చిరునవ్వుతో లోనికి వస్తున్నాడు. తొట్రుపడుతూ లేచి నాగరత్నమ్మ నమస్కరించింది. ముకుందయ్య సాదరంగా ఆహ్వానించి అతన్ని కూర్చోబెట్టాడు.

''అప్పుచెల్లె అన్నదమ్ముడు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుందే!''

కంటి అద్దాలు సవరించుకొంటూ ముందుగా హెడ్మాస్టరు గారే సంభాషణ కదిపారు.

''ఆఁ! ఏముందిలెండి? మోహనుడు పదవ తరగతి పాసయ్యాడు గదా! తరువాత ఏమి చేయడమా అని!'' —ముకుందయ్య సమాధానం పలికాడు.

''ఓహో! అలాగా!! అయితే రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే!'' మాట అంటూ నిండుగా నవ్వేశారు అయ్యవారు. అతని ప్రవర్తన అంతు పట్టక నాగరత్నమ్మ ముకుందయ్య ఆశ్చర్యముతో పడి తేరుకొనేసరికి మరలా ఆరంభించారు.

ముకుందయ్యగారూ! నేను వచ్చిన విషయాన్ని గురించే మీరూ మాట్లాడుతూండడం చాలా సంతోషించదగ్గ సంగతి. చూడండి! పాఠశాలకంతటికీ మొదట వచ్చిన తన కుమారుణ్ణి చూచి నరసయ్య కాని ఈనాడు బ్రతికిఉంటే ఎంత సంతోషపడేవాడో మాటలతో చెప్పలేము. మోహనరంగం, చాలా బుద్ధిమంతుడు. సుగుణాలఖని. పుట్టింది ఒక్కడైనా ఈ వంశానికే వన్నె దెస్తాడు. ఏ పరిస్థితుల్లో గూడ వాడి చదువును ఆపుచేయవద్దండి!''

తన నిశ్చితాభిప్రాయాన్ని వెలిబుచ్చి బదులు కోసం నిరీక్షిస్తున్నాడు పంతులుగారు. నాగరత్నమ్మ 'ఏమి చెప్పడమా?' అని అన్నయ్య వైపు చూస్తూంది. ముకుందయ్య ఆలోచనలో పడ్డాడు.

నారింజకాయ మీద ఒక చీమను వదిలితే అది ముక్కుకు సూటిగా పయనిస్తే బయలుదేరిన

39—వ పేజీ చూడండి

ఛోటు చేరుతుంది. కాబట్టి భూమి గుండ్రంగా ఉంటుందని ముకుందయ్య నమ్ముతాడు. కాబట్టే మోహనరంగం ఎటు తిరిగినా తన కాళ్ళ వద్దకు రాగలడన్న నమ్మక మేర్పడింది. దీనికి కారణం— సప్త సముద్రాల కవతల వో దీవిగడ్డ ! ఆ గడ్డ మీద ఓ మర్రిమాను. ఆ మ్రాని తొర్రలో పంజరం. ఆ పంజరంలో వో చిలుక. ఆ చిలుక ప్రాణంలో మాయల ఫకీరు ఆయువుపట్టులా కాకపోయినా తన ఇనప్పెట్టెలో భద్రంగా ఉంది విలునామా ! ఇంతదూరం ఆలోచించిన ముకుందయ్య, 'సరేనండీ ! పంతులుగారూ ! తెలివిగా చదువుకొంటానంటే వద్దనడ మెందుకు ? అలాగే చదివిద్దాం !' అని అంటూ 'ఏమంటావ్ చెల్లెమ్మా !' అని చెల్లెమ్మ వైపు తిరిగాడు. సెత్తెకాలపు మనిషి నాగరత్నమ్మ మాత్రం ఏమంటుంది ? 'సరే !' నని తలూపింది. హెడ్మాష్టరు సంతోషంతో వెళ్ళిపోయాడు.....

మోహనరంగం తిరుపతి ఆర్ట్సు కాలేజీలో ఇంటర్‌మీడియేటు తరగతిలో చేరిపోయాడు. కొడుకును వంటరిగా వదలి ఉండలేక నాగరత్నమ్మ కూడ తిరుపతిలోనే కాపురం పెట్టింది. కలిసివచ్చే కాపురానికి ఏ కాలు పెట్టినా ఒక్కటే నన్నది జన వాక్యం. దీనిని సార్థకపరుస్తూ మోహనరంగం జీవితం విచిత్రంగా మారిపోయింది. ఆ సంవత్సరాంతమున కూడ యథావిధిగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంవారు అంతర్‌కళాశాలల పోటీలు జరుపుతున్నారు. ఆ పోటీల కేంద్రం తిరుపతిగా నిర్ణయించారు. నాటిక ప్రదర్శన, వ్యాసరచన, పద్య రచన, వక్తృత్వము ఆ పోటీలోని ప్రధానాంశములు. కడపటి పోటీలో పాల్గొనుటకు ఒక్కొక్క కళాశాలనుండి ఒక్కొక్క అంశముల ఒక్కొక్క అభ్యర్థికి మాత్రమే అర్హతను బట్టి 'టిక్కట్టు' లభిస్తుంది. పద్యరచనలో అలాంటి టిక్కట్లను సంపాదించారు ఒక కాలేజీనుండి మోహనరంగం, మరొక కళాశాలనుండి రేఖ ! ఇంకను అనుబంధ కళాశాలలనుండి ఎందరో వచ్చారు.

ఆనాడు విశ్వవిద్యాలయం భవనంపైన 'డ్రమెటిక్ హాల్' నిండుగా ఉంది నాటికలను చూచి ఆనందించి, నచ్చిన వక్తృత్వాన్ని మెచ్చుకొని, కాళ్ళు నిలబడక నీళ్ళు కారిపోయే వాళ్ళను మరీ హడలగొడుతూ, ప్రేక్షకవర్గం కేరింతలు కొడుతూంది. అంతలో కార్యనిర్వాహకుడు సభావేదిక మీద నిలబడి 'ఈనాటి పోటీలలో కడపటి అంశం పద్యరచనా పోటీనం — 'కాలిపోతున్న ఇంటిని చూస్తున్న గేస్తుని హృదయావేదన అన్న శీర్షికపై' అని ప్రకటించాడు. ఒక్కొక్కరుగ తమ రచనలను చదివి వినిపిస్తున్నారు. రేఖ రంగస్థలంపై నిలబడింది వీణ తీగలాంటి సన్నని కంఠంతో కమ్మగా ఆలాపించింది పద్యాలను ప్రేక్షకవర్గములో కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. సగర్వంగా దిగివచ్చి తన స్థానంలో కూర్చుంది. ఆమెదట మోహనరంగం వంతు వచ్చింది. సభావేదికమీద నిలబడి, హాలంతా ఒక్కసారి కలయచూచి, కాలిపోతున్న ఇంటి యజమాని లాగే కమ్మని కంఠానికి విషాదంలో మెరుగులు

# నచ్చిన భాగం

27—వ పేజీ తరువాయి

దిద్ది అశ్రుతర్పణం చేశాడు. ఆ కన్నీటి కెరటాలలో తేలిపోయింది ప్రేక్షకవర్గం. అందులో పూర్తిగా మునిగిపోయింది రేఖ !' 'పద్య మంటే పదాలను ఏరి ఒక చట్రములో బిగించే అల్లిక కాదు. అదొక భావోద్వేగత ! దానికి పూర్వజన్మ సుకృతముండాలి !' అనిపించుకొన్నాడు ఆనాటి సభాసదులలో ! — అంతే ! ప్రథమ బహుమానము మోహనరంగానిది, ద్వితీయ బహుమానము రేఖకు దక్కాయి. ఆనాడే బహుమతి విజేత లిద్దరూ ఒకరికొకరు పరిచయ మయ్యారు.

ఆ పరిచయాన్ని పురస్కరించుకొని ఎన్నో సార్లు రేఖ మోహనరంగాన్ని తన ఇంటికి తేనీటి

**అతడు (సినిమా హాలులో):**
**"నీకు బొమ్మలు బాగా కనిపిస్తున్నాయా?"**
**ఆమె: "ఆ...కనిపిస్తున్నాయి."**
**అతడు : "నీ కెవరైనా అడ్డం ఉన్నారా?"**
**ఆమె : "లేరు."**
**అతడు : "నీ కుర్చీలో నల్లులు లేవుగా."**
**ఆమె : "లేవు."**
**అతడు: "నువ్విక్కడ కూర్చుని, ఆ కుర్చీ నా కిస్తావేమిటి?"**
ఆర్. నాగేశ్వరరావు (కాకినాడ)

విందు కాహ్వానించింది కానీ ఓమారుమూల పల్లెలో నివసిస్తూండిన మోహనరంగానికి ఆమెతో మాట్లాడవలె నంటేనే 'ఏదో' గా ఉండేది. అందుచేత ఎప్పటికప్పుడు 'ఈ ప్రొద్దు' 'రేపు' అని తప్పుక తిరుగుతున్నాడు

ఆరోజు ఆదివారం. కాలేజీకి సెలవు. ఇంట్లో ఏమీ తోచకుండా కూర్చున్న మోహనరంగానికి అలా వెళ్లిరావా అనిపించింది. అలా—అంటే ఎలా? అన్న ప్రశ్న కూడ వెంటనే ఉదయించింది ఆమెను వెంటనే రేఖ ఆహ్వానము జ్ఞప్తికి వచ్చింది. మోహనరంగం బయలుదేరాడు.

''రేఖా దేవిగారూ!.....రేఖాదేవిగారూ!!'' రేఖ ఇంటిముందు నిలబడి పిలిచాడు.

''ఎవరూ?. ....లోపలరా! నాయనా!!'' వృద్ధ కంఠం ఆహ్వానం పలికింది.

మోహనరంగం జంకుతూ లోపల అడుగు పెట్టాడు. బాగా మాగినగుమ్మడిపండులా ఉన్న వృద్ధుడు తలపైకెత్తి ఆతనికోసం ఎదురుచూస్తున్నాడు. అసలే అందంగాడున్న ఆతని వదనారవిందము మూడుపట్టెనామాల వెనుక మరీతేజోవంతంగావెలిగిపోతూంది. ఆయనకూర్చున్నది పులిచర్మంమీద! ఆయనమున్నది వ్యాసపీఠంమీద గ్రంథరాజము!! ఆయన చూపుల్లో వ్యక్తమవుతున్నది 'ఎవరునాయనా! నువ్వు?' అన్నమాటి ప్రశ్న!

"నాపేరు మోహనరంగమండి! రేఖాదేవి ....."

"ఓ! మోహనరంగమా! రా. నాయనా! రా!!.... ఎన్నాళ్ళ కెన్నాళ్లకు దయగలిగిందయ్యా మామీద!" అంటూ లేవడానికి ఆయాసపడుతూండిన ఆవృద్ధుని ప్రయాసను విరమింపచేస్తూ మోహనరంగం ఆతని ప్రక్కనవచ్చి కూర్చున్నాడు.

"ప్రతిదినమూ నీమాటే మాట్లాడుతుంటా మయ్యా! నువ్వు చాలాబాగా పద్యాలు వ్రాస్తావటనే!......ఆఁ! వ్రాయడమేగాదు. చాల కమ్మగా కూడ చదువుతావటనే!.....హ్హహ్హ ఈ ముసలాడికి ఆపేక్షకాస్త ఎక్కువుందిలే నాయనా! అందుకని 'ఆ అబ్బాయిని ఓమారు ఇంటికిపిలుచుక రారాదా అమ్మా! అంటే 'ఏంచెయ్యమంటావు నాన్నా! నేనేమో పిలుస్తూనే ఉన్నాను. కానీ ఆయన తప్పుక తిరుగుతున్నారు' అంటుంది మాఅమ్మాయి. పోనీ ఇన్నాళ్ళకైనా ఈ ఇంటికి దారికనబడింది."

ఈ ప్రశంసతో ఉబ్బి తబ్బిబ్బులైన మోహనరంగానికి నోటమాటట పెగల్లేదు. కానీ ఆవృద్ధుడు రేఖ తండ్రిగారని గ్రహించగలిగాడు ఆయన ఆదరభావానికి, కలుపుగోలుతనానికి లోలోపల కృతజ్ఞత తెలుపుకొన్నాడు. జంకుతో కొంకర్లు పడుతూండిన మనసు కాస్త కుదుటపడింది

"రేఖాదేవిగారు లోపలున్నట్లుంది." మోహనరంగం అడిగాడు.

"లేదునాయనా! ఇవ్వాళ ఆదివారంగదూ! అందుకని కార్లో తిరుమలకెళ్లింది ఆఁ! .... గంట పదికావస్తూందికదూ! ఈవేళకు వస్తూనే ఉంటుంది ఏదీ! ఈలోపుగ నాలుగు పద్యాలు చదువు నాయనా! వింటాను." అంటూ ముందున్న "చిక్కుపలక"ను ముందుకునెట్టాడు. మారు పలక్కుండా మోహనరంగం పద్యపఠనానికి ఆరంభించాడు. రేఖ తండ్రి—దశరథరామయ్య భావభూయిష్ఠమైన కవిత్వం అర్థగంభీరంగా సాగుతూ రసజగత్తును సృష్టిస్తే అందులోముఖ్య పాత్రత్వాన్ని సంపాదించాడు!

దాదాపు మూడువేల అడుగులఎత్తునుండి కారు శరవేగంతో ముందుకుదూకుతూ వంకర టింకర బాటమీద వయ్యారం చేస్తూంటే 'స్టీరింగ్'ముందు కూర్చున్న రేఖ హృదయం ఆనందంతో నయ్యాటలాడుతూంది. సగందారి గడిచిపోయింది. ఒక్కసారిగ అంతఎత్తునుండి క్రిందపడడంతో కడుపులో ఏదో కలియ బెట్టినట్లనిపించి, అరకప్పు కాఫీ త్రాగుదామనుకొంది కారును బాటప్రక్కన ఆపుచేసింది. పదిగంటల సమయం. నిర్మలాకాశంలో మరింత నిర్మలంగా ప్రకాశిస్తున్న సూర్యకాంతిలో అగాధమైన లోయల ప్రక్కన్నే మలిచిన బంగారు పూతపూసినట్లు తళతళ మెరిసిపోయింది. కప్పులో కాఫీ పోసి కనుకొలుక నీటుల విడలుచూస్తూన్నట్లుండి

# తెలుగు పత్రికలన్నిటిలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అధికమైనది





## చింతలూ చీకాకులతో జీర్ణశక్తి దెబ్బతింటుంది

మన దేహంలో, ఉదరకోశంనుంచి మెదడుకుపోయే నరాలు కొన్ని ఉంటాయి. చింతలతో, ఉద్రేకంతో బుర్ర వేడెక్కినప్పుడల్లా ఈ నరాలు, జీర్ణకోశం పనిచేయకుండా బిగబట్టి, రక్తనాళాలలో ఎడ్రినాలిన్‌వంటి రసాయనిక ద్రవ్యాలను గుమ్మరిస్తాయి. ఎప్పుడూ పనిచేస్తూవుండే వాళ్లకి ఇది ఉపకరించినా, కాయకష్టం తక్కువైనవారికి మాత్రం ఇందువల్ల జీర్ణశక్తి ధ్వంసం అవుతుంది. వ్యాపారస్థులలో నూటికి అరవై మంది అజీర్తితో బాధపడడానికి ఇదే కారణం. ఏమైనా తినగానే నొప్పి వస్తుంది.






హ్యూలెట్స్ మిక్స్చర్ తీసుకుంటే నొప్పి వెంటనే తగ్గుతుంది. బాగా గుణం ఇస్తుంది. ఉదరకోశం లోపలివైపున ఇది కవచంలా కమ్ముకుంటుంది. కడుపులో మంట కలిగించే రసాయనిక ద్రవ్యాల తీవ్రతను అణచివేస్తుంది. ఆహారం చక్కగా కరిగి అరిగిపోవడానికి తోడ్పడుతుంది. 80 సంవత్సరాలుగా వైద్యులు దీనిని సిఫార్సు చేస్తున్నారు. పిల్లల అజీర్తికికూడా హ్యూలెట్స్ మిక్స్చర్ దివ్యంగా పనిచేస్తుంది.
అజీర్ణ విరేచనాలకు నల్లమందు కలిపిన హ్యూలెట్స్ మిక్స్చర్ వాడండి.

## "హ్యూలెట్స్ మిక్స్చర్

పుచ్చుకోవడం మొదలుపెట్టినప్పటినుంచీ నేను శుభ్రంగా భోజనం చేయగలుగుతున్నాను."



ఏ. జె. హ్యూలెట్ & సన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్,
86/ఏ. నైనియప్ప నాయక్ వీధి, మద్రాసు - 3.


## నచ్చిన భాగం

పోయింది రేఖ! ఆమె హృదయములో పుట్టిన ఓ వేడి నిట్టూర్పు వేడికాఫీమీదగా మరింత వేడిని పుంజుకొని అనంతవాయువులో లీనమైపోయింది!

కాలిదోవలో ఓ చెట్టుకింద ఉసూరు మంటూ, కూర్చుంటుంది ఓ ముసలావిడ!

'పాపం! దారినడిచిన ఆయాసంకాబోలు! కార్లో వచ్చిన నాకే కాఫీకావలసివస్తే......ఆమెగతి!'......

దాంతో ఆమెకారుదిగింది. 'ఎందుకులేతల్లి! ఆ దేవుణ్ణి తలచుకుంటూ చిన్నంగాదిగేస్తాను' అని ఆవిడ వద్దంటున్నా వినిపించుకోకుండా లాక్కొచ్చి కార్లో కూర్చోబెట్టింది. కారుబయలుదేరింది.

'ఏ ఇంటికోడలవుతుందో కానీ మాలక్ష్మి! ఎంతమంచి మనసు!! అని ఆవృద్ధురాలు మనస్సులోనే అభినందించుకొంటుంటే, మొట్టమొదటిసారిగ ఇల్లువిడిచి, బాహ్య ప్రపంచంలో అడుగుబెట్టి శవాన్నిచూచి ఆశ్చర్యపడిన బుద్ధుడిలా, రేఖ—'ఇలాంటి జీవు లీ ప్రపంచంలో ఎందరున్నారో అనిఆలోచిస్తూంటే కారువీళ్ల ఆలోచనలతో సంబంధంలేకుండా పరుగెత్తి రేఖ ఇంటిముందర ఆగింది.

'ఇక నే వెళ్లొస్తానమ్మా!' అంటూ ఆ ముసలావిడ సెలవు తీసుకోబోయింది. కానీ రేఖ వదలలేదు. కాస్త కాఫీ త్రాగి పోవచ్చునని లోనికి ఈడ్చుకుని పోయింది. ఇద్దరూ హాల్లో అడుగుపెట్టి ఏదో వింతను చూచినట్లు విస్తుపోయారు. చలనరహితంగా ఒక్క క్షణం నిలబడిపోయారు.

వీళ్ల ఆగమనంతో అవసరం లేనట్లుగ మోహనరంగం పద్యాలు చదువుతున్నాడు.

'నమస్తే మిస్టర్! మోహన్! .... ఈవేళ చాలా సుదినం!' అన్న రేఖ పిలుపుతో ఈ లోకంలో పడ్డ మోహనరంగం, నమస్కరిస్తున్న రేఖనుకూడ గమనించకుండ 'ఎప్పుడొచ్చావమ్మా కొండ దిగి?' అని ఆతురతతో ఆ నూతనాగంతకురాలి ప్రక్క చేరి పరామర్శిస్తూంటే రేఖ ఆశ్చర్యపడిపోయింది.

"ఏమండీ! ఈవిడ మీ తల్లిగారా!"

"అవునండి! ఈవేళ వేకువజామున్నే బయలుదేరి కొండకెళ్లింది. 'బస్సులో వెళ్లిరావమ్మా!' అంటే దేవుడి దగ్గరకు కాలినడకతోనే పోవాలని పట్టుబట్టింది అయినా ఇంత తొందరగ వస్తుందనుకోలేదు!"

"మన కార్లో 'లిఫ్టు' ఇచ్చాలెండి!" అంటూ ధీమాగా బదులు చెప్పింది రేఖ!

"ఓ అలాగా! .... అయితే చాలా 'థాంక్సండీ'" అన్నాడు మోహన్!

ఆ 'థాంక్సు'ను చిరునవ్వుతో స్వీకరించిన రేఖ 'దానికేం లెద్దురూ!' అంటూంటే దశరథరామయ్య 'కాఫీ చల్లారిపోయె! రండోయ్!! .... రారండోయ్!' అని బాలానందగీతాన్ని ఆలాపించి మరలా ఒకసారి అమాంతంగా బాలుడై కూర్చున్నాడు. అది చూచి అందరూ విరగబడి నవ్వుకుంటూ 'కాఫీ' టేబిలువద్ద చేరారు. అక్కడ సరసంగా సాగిన సంభాషణలతో రెండు కుటుంబాలు పరిచయాన్ని పుంజుకొని, కాలగతిలో జరిగిన

రాకపోకలతో, దశరథరామయ్యగారి ఉదారభావాలతో ఆత్మీయత పుంజుకొన్నాయి.

ఆపిదట దశరథరామయ్యా అల్లుణ్ణి మరో ఆరు సంవత్సరాలపాటు మనుగడుపులు కుడిచే వరకు విడిచిపెట్టలేదు. ఈ ఆరు సంవత్సరాల్లో నీ విషయానికి కానీ ముకుందయ్యా అవసరం లేక పోయేసరికి ఒకవిధంగా మోహనరంగం స్వగ్రామాన్ని మరచిపోయాడనే చెప్పాలి. కానీ ఇప్పుడు భార్యాభర్తలిద్దరూ 'ఎం. బి. బి. యస్' పట్టభద్రులైన డాక్టర్లు. జీవితాన్నంతా మానవ సేవకే వినియోగించాల ఉద్రుక్తులైన యువకులు. వాళ్ల ఆశయాలు ఆచరణలోనికి రావాలంటే అన్నిటికంటే ముఖ్యం—ధనం ! దానికోసం తల్లితో ఆలోచించాడు. 'చూడు నాయనా ! మీ నాయన పోయేటప్పటికి పదివేల రూపాయల రొఖ్ఖం, ఇరవై ఎకరాల భూమి నికరంగా నిలచి ఉన్నాయి. దాన్ని మీ మామ నిలబెట్టడమే కాకుండా బాగా పెంచాడు. ఏదో నీకు తోచింది అతని కంత యిచ్చి మిగత తెచ్చుకోరాదూ !" అని సలహా యిచ్చింది. అందుకోసమే ఇన్నాళ్ల తరువాత మోహనరంగం ఊళ్లో అడుగు పెట్టాడు. రేఖ తాను పుట్టి పెరిగిన పల్లెసీమను చూడాలంటే వెంట బెట్టుక వచ్చాడు.

*   *   *

ప్రొద్దుగూట్లో మునిగింది. అరచేతి గీతలు కూడా అప్పుడప్పుడే మాసిపోతున్నాయి. మోహనరంగం 'రాళ్లబావి' దగ్గర గడ్డమీద కూర్చున్నాడు. ఎనిమిదేళ్లు అజ్ఞాతవాసం చేసిన అతన్ని చూసి 'ఇన్నాళ్లకు మేము జ్ఞాపకం వచ్చామా !' అంటూ తెల్లగా పండిన చెఱకు పూలు పిచ్చిగా నవ్వుతున్నాయి. ఒత్తుగా పూసిన గున్నమామిళ్ల మంద పవనంతో త్రాగుబోతులా తూలుతూ వెగటుగా మత్తు వాసనలను వెదజల్లుతున్నాయి. ఆ గడ్డమీద కాసేపు నిశ్చలంగా కూర్చొని ఏమి పంజాయిషి చెప్పుకున్నాడో మరి ! సస్యలక్ష్మి చల్లని చూపులతో సంతోషం ప్రకటించింది. మోహనరంగం ఇంటికి బయలుదేరాడు.

ఊరి మధ్య ఆలయం వద్ద ఒక్క క్షణం నిలబడ్డాడు. గుడి ముందర పచ్చని పందిరి పెండ్లి నాటి వేడుకను మరపిస్తూంది. 'పాలించరా ! పాండురంగా !! .... రంగా !!!' అన్న భజనకీర్తన మూడవ కాలంలో నడుస్తూంది. వారం రోజులుగ అరచి అరచి గాత్రసౌలభ్యాన్ని కోల్పోయిన భక్తాగ్రేసరులు కేవలం శిరఃకంపనతో ఆనందిస్తున్నారు. తంబురశ్రుతిలో, పిడి చెక్కల లయతో బట్ట నెత్తిమీద 'పిలక' నృత్యం చేస్తుంటే ఓ భక్త శిఖామణి ఒళ్లు మరచి ఎగురుతున్నాడు !—ఇంతకూ ఏమిటయ్యా ఆవేశ విశేషం అంటే ?—అష్టగ్రహకూటమి అరిష్టలను పారద్రోలడానికి భక్తులు చేస్తున్న భజన అది !

ఓ చిరునవ్వుతో మోహనరంగం ముందుకు సాగాడు !

"నాయనా ! రంగయ్యా !!"

ఇంటి వరండాలో నడుస్తూన్న మోహనరంగం ఆ పిలుపుతో చటుక్కున ఆగిపోయాడు.

కుర్చీలో కూర్చొని పొగచుట్ట తోడుగా ఆలోచనా స్రవంతిలో తేలిపోతున్న ముకుందయ్యా లేచి దగ్గరకు వచ్చాడు.

"రంగడూ ! .... నువ్వు వచ్చిన సంగతి నాకు తెలిసింది. సంతోషం ! కానీ నువ్వు పసివాడివి నాయనా ! 'కుటుంబము' అన్న పదానికి అర్థం తెలియకముందే ఈ ఇంటిని వదలిపెట్టి పోయావు. అందువల్ల మొట్టమొదట నీకు తెలియని కొన్ని సంగతులు విశదీకరించి చెప్పడం నా ధర్మం!"

కొడిగట్టిన చుట్టను చిటికెన వ్రేలితో విదల్చి తన ధర్మనిర్వహణకు ఆలోచనను పుంజుకొన్నట్లుగా మరోసారి చుట్టను పీల్చాడు ముకుందయ్య. ఆ ఉపోద్ఘాతంతో సంతృప్తుడై ఇతి వృత్తాన్నిగురించి ఆలోచించసాగాడు మోహనరంగం. ముకుందయ్యా మళ్లీ ఆరంభించాడు.

"ఇరవై ఎకరాలపొలం, పదివేల రూపాయల రొక్కం మీ నాయన పోయేటప్పటికి ఉండిందని అందరూ అంటారు. అందరూ ఏమిటి ?—నేను

"నీవు తనకు తగినవాడవు కావని అనకపోయావ్! ఆ మాటే అని వుంటే నీ రొట్టె విరిగి నేతిలో పడేది."

"నేనూ అందామనే అనుకుంటున్నా; కాని ఇంతలో ఆమే ఆ మాట కాస్తా అనేసింది."

పి. బ్రహ్మానందరావు (రాజమండ్రి)

కూడా అలాగే అనుకొంటూండేవాణ్ణి. కానీ ఆమాట ఇంగువకట్టిన గుడ్డలాంటిదని తీరా దిగిన తరువాత గానీ తెలిసి రాలేదు. అబ్బ! ఆయన పోయేటప్పటికి ఈ సంసారానికి ఎన్ని చిక్కులు చుట్టుకొన్నాయో ! వాటిని విడదీయడానికి నేనెంత బాధపడ్డానో !! .... ఆ ఏడుకొండలవాడికి, నాకూ మినహా మరెవ్వరికి తెలియవు. చెప్పినా గ్రహించలేరు. అందుకే నాయనా ! అన్నీ తెలిసి సర్వజ్ఞుడనిపించుకొన్న మీ నాన్న అన్ని బాధ్యతలను నాపైన త్రోశారు. ఇంతకూ నేను చెప్పేదేమిటంటే ! ... 'నీది' అంటూ ఇక్కడ ఒక్కరాగిపైసా లేదు. ముకుందయ్యా చెప్పుకుపోతున్నాడు.

".... అలాగని, అంతా నా దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుందని నేను అలా చెప్పడం తిన్న యింటికి వాసా లెంచినట్లవుతుంది. పైగా నీవేదో ఆసుపత్రి కట్టించుకోవా లన్నావట ! కాస్త పుణ్యమైనా దక్కుతుంది. కాబట్టి ఓ అయిదెకరాల భూమి లేదంటే అయిదు వేల రూపాయలు రొక్కం ఇస్తాను. తీసుకొని మారు మాట్లాడకుండా వెళ్లిపో !"

కడపటి మాటలు కాస్త కటువుగానే వినిపించాయి ఇంతకుముందు మోహనరంగం ఎక్కడో పడ్డ పిడుగుయొక్క స్వరూప స్వభావాదులను ఊహించుకొన్నాడు కానీ, ఇప్పుడు నెత్తిన పడ్డ పిడుగుపాటును అనుభవించాడు. నోట మాట రాలేదు.

దీనికి ఋజువు కావాలంటే చూసుకో !"
అంటూ ముకుందయ్యా జేబులో ఉన్న కాగితాన్ని తీసి దీమాగా మోహనరంగం చేతి కందించాడు. అతను దాన్ని చూసి ఆతర్వాత బరువుగా అడుగులు వేసుకుంటూ లోనికేగాడు.

"పిల్లకుంక ! అంతా పీడిష్టమై పోయిందనుకున్నాడు. కుందనంపు బొమ్మలాంటి నా బిడ్డను కాదని దారిన పోయే దానరిదాని మెడలో తాళి కట్టితే, నే నిక్కడ వీడి సొత్తును కాచుకూర్చుంటా ననుకొన్నాడు. హుఁ !"

ఈ భావనతో నేమో ముకుందయ్యా చూపులు కాస్త పూర్వానికి మళ్లి మెడ కొంచెం నిటారుగ నిలబడింది.

మినుకు మినుకు మనే దీపకాంతి తోడుగా ఓ మారుమూల గదిలో కూర్చొని గోళ్లు గిల్లుకొంటూండిన రేఖ భర్త ఆగమనంతో ఆనందపు వెల్లువలా లేచి వచ్చి గట్టు దాకిన ప్రవాహంలా ఆగిపోయింది. అతని తీరు చూచి దిగాలు పడిపోయింది.

"ఎందుకండి ?' 'అదోలా' ఉన్నారు !" రేఖ ప్రశ్నించింది.

ఆ పరిస్థితినుండి తేరుకొని సమాధానం చెపుదామనేలోపుగా రామలక్ష్మమ్మ వచ్చి 'ఏం నాయనా ! జామురేత్రికి పైగా అయిపోయింది. ఈవర దాకా భోంచేయకపోతే ఎలాగయ్యా ? .... మీ పట్నాల్లో మాదిర 'చాకలి తిండి' వేళ కావాలనుకున్నారా !' అని బలవంతంచేసి భోజనాల గదికి లాక్కొని పోయింది. చెరి కాస్త ఎంగిలి పడి వచ్చి పడుకొన్నారు.

"రేఖా ! మానాన్న ఇలా చేసిపోతాడని కలలో కూడ అనుకోలేదు" — ఓ అయిదు నిముషాల నిశ్శబ్దం భరించలేక మోహనరంగం మనసులోని బాధ బయటపడింది.

"ఏంచేశారండీ !" ఆతురతతో అడిగింది రేఖ.

"ఈ పాయకట్టులో ఆతనికి మించిన వ్యవహార దక్షత కలవాడు కానీ, తెలివిమంతుడు కానీ లేడని ఈనాటికీ ఈ నోటా ఆ నోటా వింటూనే ఉన్నాను. అలాంటి వ్యక్తి తన కొడుకును తన చేజేతుల ఒక బానిసగా చేసిపోతాడని కలలో కూడ అనుకోలేదు."

"అసలు విషయం చెప్పకుండా ఇలా బాధ పడితే ఎలాగండీ ?"

"ఆయన ఒక వీలునామా వ్రాసిపెట్టి పోయాడు."

"ఆఁ ! వీలునామా వ్రాశారా ? .... ఏమని వ్రాశారండి ?"

"తన ఆస్తినంతా మా మామగారి పేరిట వ్రాశారు. ఆ సదరు మామగారు తనకు నచ్చిందేదో నాకిచ్చి నన్నొక ఇంటివాణ్ణి చేయాలట !"

"ఆఁ ! ఆలాగా !!"—రేఖ ఆశ్చర్యపడింది

"అవును రేఖా ! ఇప్పుడా మామగారేమంటున్నారో తెలుసా ? తనకు నచ్చింది ఓ అయిదు వేల రూపాయల రొక్కం లేదా అయిదు ఎకరాల

భూమి అంటున్నాడు. దాన్ని తీసుకొని మారు మాట్లాడకుండా వెళ్ళిపోవాలట !''

రేఖ పూర్తిగా ఆశ్చర్యములో పడి కొట్టుకపోతుంటే మోహనరంగం ఆమెవెంట పడ్డాడు. వాళ్ళల్లో మాటలే కరువైపోయాయి. ఇద్దరూ ఆలోచిస్తున్నారు. ఊరంతా మాటు మణిగింది. కృష్ణాలయంవద్ద భజన మాత్రం లీలగా వినిపిస్తూంది. ఎడతెగని ఆలోచనలతో అలసిపోయి రేఖ, మోహనరంగం ఎప్పుడో నిద్రాదేవి ఒడిలో వాలిపోయారు ....

తాత ముత్తాతల కాలంనుండి బలహీనుల కష్టసుఖాలకు అండగా ఉండిన ఊరి మధ్య రావిచెట్టు క్రింద 'రచ్చబండ' అది ! కోర్టులో జరిగే తీర్పుకైనా పై కోర్టు కెళ్లితే మార్పు జరుగవచ్చునేమో కాని ఆ 'రచ్చబండ' వద్ద 'న్యాయము' అనిపించుకొంటే దానికి అన్యాయం జరుగడానికి వీలులేదు. అథవా ఎవరైనా అందుకు ప్రయత్నిస్తే ఆ మరుసటి రోజునుండి వాళ్ల ఇళ్ళల్లో చాకలి, మంగలి పనులు చేయరు. ఊళ్లో ఒక పిట్ట ఆ ఇంటి కడప త్రొక్కదు. అలాంటివారు సర్వసంగ పరిత్యాగులై ఏకాకులై పోవలసిందే ! .... అక్కడే ఆ మరుసటి దినం ఊళ్లో నెరసిన తలలన్నీ మాటు మణిగిన వేళ తీరిగ్గా కూర్చుని తర్జన భర్జనలు చేస్తున్నారు. ఒకనాడు తండ్రి రాజశేఖరంతో రచ్చమీద కూర్చుని న్యాయ పరిశీలన చేస్తే ఈనాడు కొడుకు న్యాయంకోసం నిలబడి ఉన్నాడు !

''నాయనా ! మోహనరంగం ! సంసారం గుట్టు మాకు మాత్రం ఏం తెలుస్తుంది చెప్పు? .... మాకు తెలిసింది, మేము చూచిందల్లా వాడు ముకుందయ్య రెక్కలు విరిచి కష్టపడడం మాత్రమే ! .... నీకేం నాయనా ! అంతో ఇంతో చదువుకొన్నావు. నీలంత చదువుకొన్న పెళ్ళానితో పాటు ఆస్తిని కూడ కొట్టేశావు. ఇదో ఈ పల్లె కొంపల్లో పడి ఉండేవాళ్లం. నీకు చెప్పాల్సిందేముంది నాయనా ! ఏదో .... వాడు ఇచ్చింది తీసుకొనిపో ! పెద్దవాణ్ణి నేను చెబుతున్నాను. ఓర్పుగ గొడ్డు లేటనీరు తాగుతుంది ....'' అన్నాడొక వృద్ధుడు.

''అదేంది మామా ! అట్లంటావే ! ముకుందయ్య యాడనే అబ్బగంటు తెచ్చిస్తూ ఉండేది. పై గుడ్డతోనే గదండీ వాడా యింట్లో అడుగు పెట్టింది. ఇంకా మాట్లాడితే వాడిచ్చింది, యీడు తీసుకోవల్సిందే కానీ .... నువ్వు చెప్పేది బలే బాగుందే !'' అని గడగడ మాట్లాడి గలగల నవ్వాడు ఒక ''అవు నోటా'' యన !

''పిల్లకాయల్ని చదివిస్తే వచ్చే తంటే ఇది !... ఎద్దుగొడ్డు అవుగొడ్డు మేసరానుంటే !'' ఏదో ఒక బిడ్డను చదివించి దెబ్బతిన్నవాడిలా మాట్లాడు ఒక 'గొడ్డుబోతా' యన !

''అయ్యా మీరు నూరు చెప్పండి. 'ఇప్పుడన్ని 'మలగులాలు' పడినా ఉపయోగంలేదు. ఈ రెండు రోజులు—అంటే అష్టగ్రహ కూటమిలో దాటిపోనీయండి. గట్టో, ప్రాట్టో తేలిపోతు ంది .... ' అని ఇంకనూ ఏదో చెప్పడానికి నోరు తెరచి అలానే ఉండిపోయాడు వేదాల

# నచ్చిన భాగం

నీలకంఠయ్య! అందరూ అతనితోపాటు నోరు తెరచారు. కాస్త జాగ్రత్త పడడంలో సరిపోయింది కానీ లేకుంటే టికట్లో ముసురుతూండిన దోమలు వాళ్ల నోళ్లల్లో ఇల్లు గట్టుకొనేవి

రేఖ అక్కడికి మెల్లగా వెళ్లింది !

''ఎందుకండి దీని కింత గొడవ పెట్టుకున్నారు. ఎవరి అదృష్టం వారివెంట నీడలో ఉంటుంది. మామగారి అభిప్రాయం ప్రకారం జరుగాలని బాబాయి పట్టుదల. పోనీయండి ! తన కుమారుడి బాగోగులపట్ల ఆయన అభిప్రాయం

---

ఒక గాయకురాలు మొదటిసారిగా కచేరీ చేసింది. పాట అవగానే పెద్ద కోలాహలం, కరతాళ ధ్వనులు వినిపించాయి. ఆవిడ తిరిగి అదేపాట పాడింది. ఇలా అయిదారుసార్లు 'వన్స్‌మోర్'లు జరిగాయి. చివరకు ఆవిడ అలిసిపోయి అంది : "చాలా సంతోషంగా ఉందికాని ఇక మళ్లీ పాడలేను దయచేసి 'వన్స్‌మోర్' అనకండి," అని.

"వీల్లేదు! పాడు; సరిగ్గా పాడేదాకా వదిలిపెట్టం!" అని ప్రేక్షకులలో ఎవరో అరిచారు.

శ్రీకాంత్ (గుంటూరు)

---

అదే అయినప్పుడు అలాగే జరిగిపోనీయండి !'' రేఖ మృదువుగా అన్నది.

''నా నెత్తిన పాలు పోశావు తల్లీ ! ఈ మాత్రం తెలివితేటలు విడికుంటే కొంప నడివీధిలో పడేదేనా ? ....'' సంతోషంతో పొంగిపోయాడు ముకుందయ్య.

''బాబాయ్ ! జరిగిందేదో జరిగిపోయింది. పాలు అన్నం తిన్న పదిమంది పెద్దలముందు న్యాయ పరిష్కారం జరగడం ఉభయులకు మంచిదే ! పోనీయండి ! మీ కూతురుగా నే నడుగుతున్నాను. బాగా ఆలోచించండి. మీరిచ్చే పైకం ఏ సత్కార్యం కోసం వినియోగ పడుతుంది !''

''రామాయణ మంతా విని రాముడు సీత కేమవుతా ఉంటే నేనేం చెప్పను తల్లీ ! ఏదో గుంభనగా బ్రతికిన సంసారపుగుట్టు ఇంత మందిలో బయటపెట్టడం నాకేమాత్రమూ నచ్చలేదు. నా బాధలన్నీ ఆ ఏడుకొండల వానికి తెలియవలసిందే !'' అంటూ అరమోడ్పు కన్నులతో అరచేతులను సంధించాడు ముకుందయ్య.

''అయితే మీ అభిప్రాయ మేమిటి బాబాయ్ ?''

''చెప్పాను గదమ్మా అప్పుడే !''

''ఇది రచ్చబండ బాబాయ్ ! — మన ఇల్లు కాదు ! ఇక్కడ తమఅభిప్రాయాన్ని అందరూ వినవలసి ఉంది !''

''అదేనమ్మా ! రొక్కమైతే అయిదువేలు, భూమిరూపేణా అయితే అయిదెకరాలు !''

''అంటే బాబాయ్ ! మామగారి ఆస్తిలో అయిదువేలు రొక్కం మేము తీసుకొంటే, ఇరవై ఎకరాల భూమి, అయిదువేల రూపాయలు మీరు తీసుకొంటారు. అయిదెకరాలభూమిని మేము తీసుకొంటే, పదివేల రూపాయల రొక్కం, పదిహేను ఎకరాలభూమి మీరు తీసుకుంటారు ! అంతేగదు బాబాయ్ !''

''అదేమిటమ్మా ! లెక్కలురాని పిల్లోణ్ణి అడిగినట్లుందే !''

''అదిగాదు బాబాయ్ ! మామగారి ఆస్తి వివరాలు సరిగ్గా తెలియవు గాబట్టి అడుగుతున్నాననుకోండి. ఐదెకరాల భూమిలో బ్రతకడం చాలాకష్టం ! మరొక్కసారి ఆలోచించండి బాబాయ్ ! మీ బిడ్డలుగా నిలబడి అడుగుతున్నాం !''

''అయ్యయ్యో ! ఇందులో నాదేమీ లేదు తల్లీ ! అంతా స్వర్గంలో ఉన్న నా బావ ఆజ్ఞను మాత్రమే నేను శిరసావహిస్తున్నాను !''

''సరి బాబాయ్ ! అంతా స్వర్గంలో ఉన్న మామగారి ఇష్ట ప్రకారమే జరుగనివ్వండి !''

''ఏ అమ్మ కన్నబిడ్డవో తల్లీ ! మంచి సమయములో కడుపున పుట్టిన బిడ్డకంటె ఎక్కువగా ఆదుకొంటున్నావు.''

సంతోషసాగరంలో పూల తెప్పపై తేలిపోతూ మాట్లాడుతున్నాడు ముకుందయ్య. రచ్చబండదగ్గర పెద్దలు రిచ్చవడి వింటున్నారు.

''బాబాయ్ ! అయిదెకరాల పొలం మేం తీసుకొంటే, మిగత పదిహేను ఎకరాల పొలం, పదివేల రూపాయల రొక్కం మీరు తీసుకొంటారు. అంతేగదు బాబాయ్ !''

''అంతేనమ్మా ! అంతే !!''—ముకుందయ్య స్వరంలో సంతృప్తి తొణికిసలాడుతూంది.

''ఇది మీకు ఇష్టమే గద బాబాయ్ !''

''అని వేరే చెప్పాలా తల్లీ !''

''సరి ! మీకు ఇష్టమైన భాగాన్ని మీకు నచ్చిన భాగం అనవచ్చు గద బాబాయ్ !''

''అనుకోవడంలో తప్పేముందమ్మా !''

''అయితే ఒక్కసారి వీలునామాను చూడండి. మీకు నచ్చిన భాగాన్ని తన కుమారుని కివ్వమని మామగారి ఆజ్ఞ !''

''అవును బాబాయ్ ! తెలివిమంతుడు, వ్యవహార దక్షుడు అయిన మామగారు మానవుని స్వార్థతకు మంచి విరుగుడు మందుగా ఈ వీలునామాను వ్రాసిపోయారు.''

''అష్టగ్రహకూటానికి కాదయ్యా ! ఆడకూతురు ముకుందయ్యకు పెట్టింది చిక్కంగా మూడు పదెనామాలు !'' అన్నాడు వేదాల నీలకంఠయ్య. ★